నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

RNI - TELTEL/2023/87644

సంచిక : 355 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 19-04-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

ప్రియ వచనము లేక ప్రేమను జూపక
రోజు రోజు గూడ రోయుకొనుచు
జాలి చూపకుండ చరియించు నట్లున్న
తల్లి కన్న సవతి తల్లి మేలు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.


## మహిళలకు విపక్షాలు వ్యతిరేకం

- బిల్లును అడ్డుకుని పెద్ద తప్పు చేశాయి
- ఊరూరా ఈ విషయం ప్రచారం చేయండి
- కేబినేట్ భేటీలో ప్రధాని మోడీ సూచన
- కేంద్ర ఉద్యోగులకు 2శాతం డిఎ పెంపు
- 13వేల కోట్లతో సావరిన్ మారిటైమ్ ఫండ్ ఏర్పాటు

2 లో



## మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ కుట్ర

- మహిళా రిజర్వేషన్ల వెనుక నియోజకవర్గాల పునర్విభజన దాగి ఉంది
- తమిళ భాష, సంస్కృతిని దెబ్బతీసేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ గత కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నాయి
- డీలిమిటేషన్‌తో తమిళనాడు ప్రాధాన్యం తగ్గింపు
- అందుకే రాజ్యాంగ సవరణ బిల్లును అడ్డుకున్నాం
- తమిళనాడు ఎన్నికల ప్రచారంలో రాహుల్

2 లో





## అమెరికా యూ టర్న్..

- రష్యా నుంచి చమురు కొనేందుకు మళ్లీ అనుమతి..
- ఇండియాకు ఊరట

న్యూఢిల్లీ

చమురు సంక్షోభంతో ఇబ్బంది పడుతున్న దేశాలకు ఊరటనిచ్చేలా అమెరికా నిర్ణయం తీసుకుంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసేందుకు ఇతర దేశాలకు అమెరికా అనుమతినిచ్చింది. ఇది ఇండియా సహా అనేక దేశాలకు ఊరట కలిగించే విషయం. గతంలోనే రష్యా నుంచి చమురు కొనుగోలుపై ఆంక్షల్ని అమెరికా విధించింది. అనంతరం ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ఆంక్షల్ని సడలించింది. తిరిగి మళ్లీ ఆంక్షలు విధించింది.ఇప్పుడు మళ్లీ యూటర్న్ తీసుకుని, రష్యా నుంచి చమురు కొనుగోలుకు అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ శుక్రవారం రాత్రి ఆదేశాలు

-మిగతా 2 లో

# మహిళా రిజర్వేషన్‌లో చిత్తశుద్ధి లేదు



దక్షిణాదిని దెబ్బతీసే కుట్రను అడ్డుకున్నాం

### బిల్లు ముసుగులో డీలిమిటేషన్ చట్టం

- చిత్తశుద్ధి ఉంటే కేవలం మహిళా బిల్లు తేవాలి
- అందుకు ఇండి కూటమి బేషరతుగా మద్దతు ఇస్తుంది
- బిజెపితో జతకట్టిన పార్టీలకు ఎదురుదెబ్బలు తప్పవు
- తెలుగు దేశం పార్టీకి కూడా ఆ ప్రమాదం ఉంది
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**

మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చారని కేంద్ర ప్రభుత్వంపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. మహిళా బిల్లు వీగిపోవడంతో ప్రతిపక్షాలపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ చాలా చేసిందని పేర్కొన్నారు. మహిళా బిల్లు వీగిపోవడం.. భాజపా విధానాల ఓటమిగా భావించాలి. ఈ బిల్లుపై ప్రధాని మోదీకి నిజాయతీ లేదు. నిజాయతీగా మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువస్తే.. పార్లమెంట్‌లో అందరూ మద్దతు తెలిపేవారని అన్నారు. అయితే మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చి దక్షిణాదికి అన్యాయం

-మిగతా 2 లో



## తెలంగాణలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

- కుమురంభీం జిల్లా కెరిమెరిలో అత్యధికంగా 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత
- నిజామాబాద్ జిల్లా మెండోరాలో 44.5 డిగ్రీలు
- ఏప్రిల్‌లో మరింత పెరిగే అవకాశం

**హైదరాబాద్ ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**

:తెలంగాణలో రోజు రోజుకీ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఏప్రిల్ చివరి నాటికి ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఎప్రిల్ తెలంగాణలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఉదయం నుంచే భానుడు భగభగమంటున్నాడు. వివిధ పనుల కోసం బయటకు వెళ్లిన ప్రజలు ఎండవేడిమి తట్టుకోలేక ఆపసోపాలు పడుతున్నారు. శనివారం కుమురంభీం జిల్లా కెరిమెరిలో అత్యధికంగా 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నిజామాబాద్ జిల్లా మెండోరాలో 44.5

-మిగతా 2 లో



## రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడం ఆనందం

- దేశాన్ని విభజించే కుట్రలను ఆపారు
- వారందరికీ ఎన్నో కృతజ్ఞతలు
- ఎక్స్ వేదికగా స్టాలిన్ వెల్లడి

చెన్నై

లోక్‌సభలో శుక్రవారం రాజ్యాంగ 131 సవరణ బిల్లు 2026 వీగిపోయింది. దీంతో నల్లచట్టమైన డీలిమిటేషన్‌ని కేంద్రం ఉపసంహరించుకుంది. డీలిమిటషన్ అనే నల్లచట్టానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు చేసిన పోరాటం పార్లమెంటులో విజయం సాధించిందని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అన్నారు. దానిని ఓడించినందుకు ఇండియా బ్లాక్ ఎంపీలకు, మహిళలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వీడియో పోస్టు చేశారు. నేను ఆనందంతో, నూతన శక్తితో మీ ముందు నిలబడ్డాను. డీలిమిటేషన్ అనే నల్లచట్టానికి వ్యతిరేకంగా మన పోరాటం విజయవంతమైంది. ఈ ప్రమాదాన్ని ఏడాది క్రితమే ఊహించి, ఈ విజయాన్ని సాధించడానికి అవసరమైన పనులన్నీ అప్పుడే మొదలుపెట్టాము. మొదట ముఖ్యమంత్రులు, ప్రతిపక్ష నాయకుల సమన్వయ సమావేశంతో మొదలుపెట్టి, మొన్న మేము నల్లజెండా

-మిగతా 2 లో


## పునర్వికకు పునర్జన్మ

- నూరేళ్లు జీవించు చిట్టితల్లీ
- ఖరీదైన ఇంజక్షన్‌కు లోకేశ్ సాయం

**అమరావతి, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**

అరుదైన స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (ఎస్ఎంఏ టైప్-1) వ్యాధితో బాధపడుతున్న కర్నూలుకు చెందిన పునర్విక అనే చిన్నారికి శనివారం వైద్యులు రూ.16 కోట్ల విలువైన ఇంజెక్షన్ చేసినట్లు మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఈ మేరకు తాను ఇచ్చిన హామీ నెరవేరిందంటూ 'ఎక్స్'లో ఆయన పోస్టు పెట్టారు. అరుదైన వ్యాధితో బాధపడుతున్న

-మిగతా 2 లో



## చట్ట పరిశీలనకు లోబడే మతాచారాలు!

- శబరిమల కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**

మత విశ్వాసాలకు సంబంధించిన విషయాలపై నిర్ణయాలు తీసుకునేటప్పుడు న్యాయమూర్తులు వ్యక్తిగత మత విశ్వాసాలకు అతీతంగా వ్యవహరించాలని, మనస్సాక్షి స్వేచ్ఛ, విస్తృత రాజ్యాంగ చట్రం ద్వారా మార్గనిర్దేశం పొందాలని సుప్రీంకోర్టు తెలియచేసింది.

-మిగతా 2 లో



# అమ్మలారా.. బిడ్డలారా నన్ను క్షమించండి

### స్వార్థపూరిత పార్టీలు మీ హక్కులను హరించాయి..!


- మహిళా బిల్లు అడ్డుకోవడం ముమ్మాటికి భ్రూణహత్యే
- కాంగ్రెస్,ఎస్పీ, తృణమూల్, డిఎంకెలదే ఈ బాధ్యత
- కుటుంబ పార్టీలతో మహిళలకు న్యాయం జరగదు
- అన్ని రాష్ట్రాలకు సమన్యాయం జరిగేలా సవరణ బిల్లు తెచ్చాం
- రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ దుష్ప్రచారం
- ఈ పాపం ఆ పార్టీలను వదిలి పెట్టదు... మహిళా శక్తి చూస్తూ ఊరుకోదు
- జాతిని ఉద్దేశించిన చేసిన ప్రసంగంలో మోడీ ఘాటు విమర్శలు



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**

భారత నారీశక్తి ఎదగకుండా కాంగ్రెస్ తదితర విపక్షాలు అడ్డుకున్నాయని ప్రధాని మోదీ ఆక్షేపించారు. భారత మహిళల కలలను ధ్వంసం చేశారని విమర్శించారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయిన నేపథ్యంలో.. దేశ ప్రజలను ఉద్దేశించి శనివారం మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధాని దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పారు. ఈ బిల్లును ఆమోదింపచేయకపోవడం తనకు బాధ కలిగించిందన్నారు. ఇది ముమ్మాటికీ భ్రూణ హత్యేనని అన్నారు. దేశ హితమే తమకు అత్యంత ముఖ్యమని, కొందరికి మాత్రం దేశం కంటే రాజకీయాలే ముఖ్యమని విమర్శించారు.

-మిగతా 2 లో



## గెలిచే మ్యాచ్‌లో ఓడిన చెన్నై..

- సన్ రైజర్స్ హైదరాబాద్ మూడో విజయం
- ఉప్పల్‌లో సీఎస్కేపై థ్రిల్లింగ్ విక్టరీ
- పోరాడి ఓడిన చెన్నై సూపర్ కింగ్స్

న్యూఢిల్లీ

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ ఎడిషన్‌లో సన్ రైజర్స్ హైదరాబాద్ మూడో విక్టరీ నమోదు చేసింది. శనివారం హైదరాబాద్‌లోని ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన ఉత్కంఠ మ్యాచులో 10 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసి.. 194 రన్స్ చేసింది ఆరెంజ్ ఆర్మీ. ఆ తర్వాత సీఎస్కేను 184 పరుగులకే పరిమితం చేసింది.195 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నై సూపర్ కింగ్స్.. 10 ఓవర్లలో 111/3తో నిలిచి ఈజీగా గెలిచేలా కనిపించింది. కానీ ఇక్కడే సన్ రైజర్స్ హైదరాబాద్ బౌలర్లు మ్యాచ్‌ను మలుపు తిప్పారు. గత మ్యాచులో రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచులో అద్భుత ప్రదర్శన చేసిన ఆరెంజ్ ఆర్మీ బౌలర్లు.. ఈ మ్యాచులోనూ అదే రిపీట్ చేశారు. చివరి ఓవర్లలో కట్టుదిట్టంగా బంతులేశారు.ముఖ్యంగా చివరి ఓవర్లో ప్రఫుల్ హింగే .. మ్యాచ్ విన్నింగ్ స్పెల్ వేశాడు.

-మిగతా 2 లో



## తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతీసిన తేజస్వీసూర్య

- పెదవి విప్పని తెలంగాణ బిజెపి, కాంగ్రెస్ ఎంపిలు
- ఈ వ్యవహారాన్ని ఇంతటితో వదిలే ప్రసక్తి లేదు
- రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమే అన్న హరీష్ రావు
- రాజకీయ పునరేకీకరణ ప్రారంభమయ్యిందన్న కెటిఆర్
- జగిత్యాలలో కెసిఆర్ ఆశీర్వాద సభ ఏర్పట్లు పరిశీలన

**జగిత్యాల ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**

బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న కేసీఆర్' ప్రజా ఆశీర్వాద సభ' ఏర్పాట్లను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీష్‌రావు మాట్లాడారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు తెలంగాణ ఎంపీ , కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సపోర్టుగా నిలిచారని ఆరోపించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడితే తెలంగాణలో 8 మంది బీజేపీ, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉన్నా ఏం లాభమని అన్నారు.

-మిగతా 2 లో

# ఉపాధి హామీ కూలీలకు తాగునీరు అందించిన సర్పంచ్



**మర్రిగూడ, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మర్రిగూడ మండల కేంద్రంలోని కొట్టాల గ్రామపంచాయతీ పరిధిలో ఎండ తీవ్రత పెరగడంతో ఉపాధి హామీ కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని గమనించిన గ్రామ సర్పంచ్ కల్లెట్ల లింగయ్య శనివారం కూలీల వద్దకు వెళ్లి పరిశీలించారు.ఎండల తీవ్రత కారణంగా కూలీలకు తాగునీరు అందించి ఉపశమనం కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

# ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం




**మేడ్చల్--మల్కాజిగిరి, ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 15 నుండి ఆన్లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్ కుమార్ తెలిపారు.మూడు విడతల్లో అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. జూన్ చివరి వరకు సీట్ల కేటాయింపు పూర్తవుతుందని, జూన్ 20 నుండి 27 మధ్య విద్యార్థులు సంబంధిత కళాశాలలో రిపోర్ట్ చేయాలని ఆయన తెలిపారు.

# బోడుప్పల్--చిలకనగర్ రహదారి కల్వర్టు ప్రారంభం



**బోడుప్పల్, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మల్కాజిగిరి నగరపాలక సంస్థ బోడుప్పల్ సర్కిల్ పరిధిలో బోడుప్పల్--చిలకనగర్ ప్రధాన రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బయన్నగూడలో పూర్తయిన కల్వర్టును శనివారం మాజీ మేయర్ తోటకూర అజయ్ కుమార్ యాదవ్ బి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ గుర్రాల రామ వెంకటేష్ యాదవ్తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాజీ మేయర్ అజయ్ మాట్లాడుతూ హెచ్ఎండిఏ నిధులతో రహదారి విస్తరణ పనులు చేపట్టామని, కల్వర్టు చిన్నగా ఉండటం వల్ల ఇక్కడి ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారని, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికే ప్రధాన పనులు పూర్తయ్యాయని, విద్యుత్ స్తంభాల తొలగింపు--ఏర్పాటు పనులు త్వరలో ముగుస్తాయని, రహదారి విస్తరణను త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తెస్తామని అన్నారు.రోడ్డు విస్తరణకు సహకరించిన మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు, డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు బొమ్మక్ కళ్యాణ్ కుమార్, భూక్యా సుమన్, కాంగ్రెస్ నాయకులు తోటకూర శ్రీశైలం యాదవ్, సిలివేరీ విజయ్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# భాగ్యనగర్ లయన్స్ క్లబ్స్ సమక్షంలో ఉచిత వైద్య శిబిరం




**కరీంనగర్, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320జి, లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ శాతవాహన ఆధ్వర్యంలో భాగ్యనగర్ న్యూ లేబర్ అడ్డా వద్ద హరిహర క్లినిక్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ రవికాంత్ పర్యవేక్షణలో టెక్నీషియన్ జి. రవికుమార్ బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో 51 మంది సభ్యులు పరీక్షలు చేయించుకున్నారు.పరీక్షల అనంతరం వారికి తగిన జాగ్రత్తలు సూచించబడగా, ప్రజలు ఈ సేవను అభినందించారు.

# రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత

అనాజిపురం గ్రామ సర్పంచ్ అనిత మొగిలయ్య.



**దేవరకొండ ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
చింతపల్లి మండలంలోని అనాజిపురం గ్రామంలో గ్రామ సర్పంచ్ బుషిపాక అనిత మొగిలయ్య అధ్యక్షతన నిర్వహించిన అరైవ్ అలైవ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చింతపల్లి ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి పాల్గొన్నారుఅనాజిపురం గ్రామంలో ఉన్న వాహనదారులకి గ్రామ సర్పంచ్ బుషిపాక అనిత మొగిలయ్య సొంత నిధులతో ఉచిత హెల్మెట్ పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ అనిత మొగిలయ్య మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో రోడ్డు ప్రమాదాల నివారణ పై ప్రజలకు సూచనలు చేశారు గ్రామంలోకి వచ్చే వాహనాలకు హెల్మెట్ ధరిస్తేనే గ్రామంలోకి అనుమతించాలని సూచించారు రాష్ట్రంలో నిత్యం రోడ్డు ప్రమాదాల్లో పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని వాటిని నివారించడానికి అవగాహన ద్వారానే సాధ్యమని భావించి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అలైవ్ ఆరైవ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వివరించారు ప్రతి పౌరుడు బాధ్యతగా ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించాలని సూచించారు ద్విచక్ర వాహనాలపై ప్రయారిస్తున్నా వారు ఇద్దరు హెల్మెట్ ధరించాలని అన్నారు కారులో ప్రయాణిస్తున్న వారు తప్పనిసరిగా సీటు బెల్ట్ ధరించాలని నిర్నిత వేగాన్ని మించి వాహనాలను నడపవద్దని సూచించారు ప్రతి ఒక్కరు జాగ్రత్తగా డ్రైవింగ్ చేయడం ద్వారా ప్రాణ నష్టాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాలు ప్రజల భద్రత కోసం ఉపయోగకరమైన తెలిపారు .ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రియాంక, ఆశా వర్కర్ సునీత ,పోలీస్ శాఖ సిబ్బంది, గ్రామ పెద్దలు శేఖర్ రెడ్డి, శ్రీకాంత్ ,ధర్మ రెడ్డి ,సందీప్, సత్యంరెడ్డి ,రాకేష్ ,అరవింద్, ప్రశాంత్ ,లక్ష్మయ్య ,లాలయ, వెంకటరెడ్డి ,మహేష్ తదితరులుపాల్గొన్నారు.

# బీజేపీ మోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకోవాలి

యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి:జరుపుల లక్ష్మి-తిరుపతి.



**దేవరకొండ ఏప్రిల్ 18.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
తెలంగాణ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ ఇంద్ర పార్క్ మహాధర్న చేపట్టారు.యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిజరుపుల లక్ష్మి-తిరుపతి పాల్గొని ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతుల పట్ల వారి వైఖరి సరియైనది కాదు ఆమె మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధులుగా మంత్రి సీతక్క, జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ్ చిబ్ , రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి , రాష్ట్ర ఇంచార్జు భవ్య మరియు రోహిణి తదితరులు,యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# వైద్య ఆరోగ్య కేంద్రాలలో జిల్లా వైద్య అధికారి పర్యటన




**మానకొండూర్, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ చెల్పూర్, చల్లూరు, వీణవంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జమ్మికుంట--2 సబ్ సెంటర్, చల్లూరు పల్లె దావఖానాలను ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్, అవుట్ పేషెంట్ రిజిస్టర్, ఎన్‌సిడీ రిజిస్టర్, ఫార్మసీ స్టోర్స్, పిల్లల టీకాల నిల్వ కోసం ఉపయోగించే ఐఎల్ఆర్, దాని రోజువారీ టెంపరేచర్ రికార్డులను పరిశీలించారు. పీహెచ్సీ డెలివరీలు, మాతా--శిశు ఆరోగ్య సేవలను మెరుగుపరచాలని, గర్భిణీ స్త్రీల చెకప్స్, అభా కార్డుల సృష్టి సంఖ్యను పెంచాలని సూచించారు.13 ఏళ్ల పైబడిన వారందరికీ ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపులలో స్క్రీనింగ్ చేసినవారిని రీ--స్క్రీనింగ్ చేస్తూ ఫాలోఅప్ చేయాలని ఆదేశించారు. ప్రసూతి గది పరిశుభ్రత, ప్రోటోకాల్ చార్టులను పరిశీలించారు. అదేవిధంగా చల్లూరు సబ్ సెంటర్ నిర్మాణ బిల్లింగ్‌ను కూడా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ శ్రావణ్ కుమార్, వైద్యాధికారులు డాక్టర్ తులసి దాస్, డాక్టర్ సుచిత్ర, సంబంధిత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మల్చేరు తండలో ఉపాధి హామీ పనులకు టెంట్ బహూకరణ



**హుస్నాబాద్, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అక్కనపేట మండలం మల్చేరు తండ గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు గ్రామ సర్పంచ్ మహేందర్ నాయక్, ఉప సర్పంచ్ విట్టల్, పాలకవర్గ సభ్యులు కలిసి టెంట్‌ను బహూకరించారు.ఎండ తీవ్రతలో పనిచేస్తున్న కూలీలకు విశ్రాంతి కల్పించేందుకు ఈ టెంట్ ఉపయోగపడుతుందని వారు తెలిపారు. కూలీల సంక్షేమం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని, గ్రామ అభివృద్ధి కోసం ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని సర్పంచ్ మహేందర్ నాయక్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉపాధి హామీ కూలీలు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# పేదవారికి సహాయం ఆనందదాయకం

మాలే రవీందర్ రెడ్డి



**తలకొండపల్లి, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
"పేదవారికి సహాయం చేయడంలో ఉన్న ఆనందం మరెక్కడా లేదు" అని కాంగ్రెస్ నాయకుడు మాలే రవీందర్ రెడ్డి అన్నారు.రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం చీపునుంతల గ్రామంలో సంవత్సరాలుగా ఇండ్లు కట్టుకొని సిమెంట్ లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు ఆయన సహకారంతో సిమెంట్ పంపిణీ చేశారు. ఈ సహాయంతో వంగూరి నరసింహా, వంకూరి మల్లయ్య, గుమ్మడి పార్వతమ్మ, గుమ్మడి మంజుల, చినుకుంట్ల లలితమ్మ, పిరికిరాల పోచమ్మ తదితరులు లబ్ధి పొందారు.గ్రామ ప్రజలు మాలే రవీందర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ, మాజీ సర్పంచ్ బండి రఘుపతి, వార్డు సభ్యుడు వంకూరి శ్రీరామ్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోస్కె శ్రీశైలం, నాయకులు పెంటయ్య, యాదగిరి, నరసింహా, మల్లయ్య, గుమ్మడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు ఘన సన్మానం



**హుస్నాబాద్ , ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కోహెడ ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ కనబరచి రాష్ట్ర, జిల్లా స్థాయిలో ర్యాంకులు సాధించిన సందర్భంగా వారిని సామాజిక కార్యకర్త, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పిడిశెట్టి రాజు శనివారం ఘనంగా సన్మానించారు.ఇంటర్ మొదటి సంవత్సరం సిఈసి గ్రూపులో ఇట్టవేణి ప్రదీప్ కుమార్ 500 మార్కులకు గాను 490 మార్కులు సాధించగా, ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో వెల్దండి శిరీష 1000 మార్కులకు గాను 951 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి ర్యాంకులు పొందారు. ఇతర ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కూడా అభినందించారు.ఈ సందర్భంగా పిడిశెట్టి రాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ర్యాంకులు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇందుకు కృషి చేసిన కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ యాదగిరి, అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.ప్రభుత్వ కళాశాలలో మధ్యాహ్న భోజన వసతి ఏర్పాటు జరుగుతుండటం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణపూర్ మాజీ సర్పంచ్ అన్నబోయిన కనుకయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# పెరిగిన జనాభాకు అనుగుణంగా జిల్లాలలో తక్షణమే క్యాడర్ స్ట్రెంత్ ను మంజూరు చేయాలి.





**-సిబ్బందిపై పని ఒత్తిడిని తగ్గించాలి...**
**-ఖాళీగా ఉన్న పోస్టులలో వెంటనే పదోన్నతులపై నియమించాలి...**
**-ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మినిస్టీరియల్ సమావేశం...**
**- డైరీ ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్...**

**మహబూబ్ నగర్, ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్):** షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ మినిస్ట్రీ రియల్ స్టాఫ్ అసోసియేషన్ మహబూబ్నగర్ జిల్లా డిప్యూటీ కార్యాలయంలో మినిస్టీరియల్ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం బుధవారం జరిగింది. అనంతరం జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా స్టాఫ్ అసోసియేషన్ వార్షిక డైరీ 2026 ను విడుదల చేయడం జరిగింది. అంతకుముందు జరిగిన మినిస్టీరియల్ అసోసియేషన్ సమావేశానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరియు మహబూబ్ నగర్ సీనియర్ అసిస్టెంట్ డి.విశ్వమూర్తి అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ, కల్చరల్ వింగ్ కన్వీనర్ నీరటి చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో క్యాడర్ స్ట్రెంత్ ను తక్షణమే మంజూరు చేయాలని, గౌరవ కార్యవర్గ సభ్యులు శ్రీమతి కె.కవిత, పూజారి నరసింహులు, బి.రాజేంద్రప్రసాద్, కూన స్కైలాబ్ రాష్ట్ర కమిటీకి విజ్ఞప్తి చేశారు. క్యాడర్ స్ట్రెంత్ లేకపోవడం వలన పరిపాలన రంగంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు వాపోయారు. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలోని జిల్లా కేంద్రంలో జోన్ 7 కేంద్రమైన మహబూబ్నగర్ లో ఒక సీనియర్ అసిస్టెంట్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్ లు, ఒక సూపరింటెండెంట్ మాత్రమే ఉండడంతో పని ఒత్తిడి పెరిగిందని తెలిపారు. పదోన్నతుల విషయంలో క్లియర్ వేకెన్సీ ఉన్నదని, జోన్ 7 లో సూపరింటెండెంట్ గా తక్షణమే పదోన్నతిని కల్పియాలని, వనపర్తి గద్వాల్ జిల్లాలకు రెగ్యులర్ డిఎస్సిడిఓ లను నియమించాలని, సూపరింటెండెంట్ పోస్టులను మంజూరు చేయాలని ఈ సందర్భంగా సమావేశంలో డిమాండ్ చేశారు. ఆరు నెలల క్రితం ఖాళీ అయిన నాగర్ కర్నూల్ సూపరింటెండెంట్ పోస్ట్ కు పదోన్నతి పై నింపేలా చర్యలు తీసుకోవాలని వారు రాష్ట్ర కమిటీకి విజ్ఞప్తి చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా పరిధిలో జిల్లా కేంద్రంలో మరియు అచ్చంపేటలో ఏ ఎస్ డబ్ల్యూ ఓ కార్యాలయాలను మంజూరు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా కేడర్ స్ట్రెంత్ ను కూడా పెంచి ఎస్సీ లబ్ధిదారులకు న్యాయం చేసే విధంగా కృషి చేయాలని కమిషనర్ కు మరియు ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ గారికి కు విజ్ఞప్తి చేశారు. చదలు పట్టిన జూనియర్ అసిస్టెంట్ కం టైపిస్టు పోస్టులు రద్దుచేసి వాటిని జూనియర్ అసిస్టెంట్ లుగా కన్వర్ట్ చేయాలని ఈ సందర్భంగా అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. పదవి విరమణ పొందిన సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులను తక్షణమే పదోన్నతులపై భర్తీ చేయాలని సమావేశం డిమాండ్ చేసింది.ఈ కార్యక్రమంలో కన్వీనర్ కల్చరల్ స్టేట్ కన్వీనర్ నీరటి చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీమతి కె.కవిత, పూజారి నర్సింలు బి.రాజేంద్రప్రసాద్, కూన స్కైలాబ్, గంజి శ్రీనివాసులు, ముత్యాల రవీందర్, కిరణ్ కుమార్, మంచాల తిరుపతి, సిహెచ్.అవంతి, ఏ.రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# దేవరకొండ న్యాయస్థానాన్ని సందర్శించిన నల్లగొండ జిల్లా పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి

## శ్రీ కులకర్ణి విశ్వనాథ్ దిలీప్ రావు.

**దేవరకొండ ఏప్రిల్ 18.(నీలగిరి ఎక్స్ ప్రెస్).** దేవరకొండ డివిజన్ కేంద్రంలోని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు వార్షిక తనిఖీలలో భాగంగా శనివారం నల్లగొండ జిల్లా పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి శ్రీ కులకర్ణి విశ్వనాథ్ దిలీప్ రావు దేవరకొండ న్యాయస్థానాన్ని సందర్శించారు.న్యాయస్థాన ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా న్యాయమూర్తి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.అనంతరం బార్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య




అతిథిగా ప్రసంగించారు. న్యాయవాదులు తమ వృత్తి ధర్మాన్ని సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, కక్షిదారులకు సత్వర న్యాయం అందేలా కృషి చేయాలని సూచించారు.కోర్టులలో పేరుకుపోయిన కేసుల సంఖ్యను తగ్గించేందుకు న్యాయవాదులు చొరవ చూపాలని, సామాన్యులకు న్యాయం చేకూర్చడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో దేవరకొండ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కె.వి.ఎస్ హరీష్ బాబు , అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ స్నేహ, దేవరకొండ డి ఎస్ పి శ్రీనివాసరావు, సిఐ వెంకట్ రెడ్డి , బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సన్నాయిల ఉమామహేశ్వర్, వనం జగదీశ్వర్, సీనియర్ న్యాయవాదులు గాజుల ఆంజనేయులు, నెమ్మికంటి గౌరీ శంకర్,ఏజిపి నెమ్మికంటి రమాశంకర్, ఎండి శోకత్ అలీ, ఇంద్రవరప్రసాద్, ఈ . రవి, సిహెచ్. అశోక్, ఎస్. శ్రీకాంత్, జె. ఇద్దయ్య, గణేష్, ఆంజనేయులు, ఏ. కృష్ణ, కె. సురేష్, బి. సాయి, ఎన్.చంద్రశేఖర్, రాజకుమార్, రమేష్, శివ, సూపర్టెండెంట్లు అజార్ అలీ, సరిత, గిరిధర్ మరియు కోర్టు సిబ్బంది, కోర్టు పోలీసు వారు పాల్గొన్నారు.

# శాతవాహన విశ్వవిద్యాలయంలో ప్రశాంతంగా డిగ్రీ పరీక్షలు



**కరీంనగర్, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శాతవాహన విశ్వవిద్యాలయంలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల రెండవ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతున్నాయి. ఉపకులపతి ఆచార్య యు. ఉమేష్ కుమార్ ఆకస్మిక తనిఖీ భాగంగా కరీంనగర్ పట్టణంలోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల, వివేకానంద డిగ్రీ కళాశాల, అపూర్వ మహిళా డిగ్రీ కళాశాలను పరీక్షా నియంత్రణాధికారి డాక్టర్ డి. సురేష్ కుమార్‌తో కలిసి సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ పరీక్షలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, పరీక్షలు ముగిసిన వెంటనే మూల్యాంకనం చేపట్టి ఫలితాలను సకాలంలో విడుదల చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఘనంగా యునైటెడ్ తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఫర్ మైనారిటీస్ క్యాలెండర్ల ఆవిష్కరణ



**పెద్దపల్లి, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** యునైటెడ్ తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఫర్ మైనారిటీస్ (యునైటెడ్ టీమ్) వాల్ మరియు టేబుల్ క్యాలెండర్ల ఆవిష్కరణ కార్యక్రమం పెద్దపల్లి జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షులు, తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ బొంకూరి శంకర్ చేతుల మీదుగా జరిగింది.ఈ సందర్భంగా యునైటెడ్ టీమ్ రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ షేక్ నిసార్ అహ్మద్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా మైనారిటీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘం కట్టుబడి ఉందని తెలిపారు. వివిధ శాఖల్లో పనిచేస్తున్న మైనారిటీ ఉద్యోగులు తమ సమస్యలను సంఘం దృష్టికి తీసుకురావాలని, వాటిని సంబంధిత అధికారుల వద్ద సమర్థవంతంగా ప్రతినిధిత్వం చేసి పరిష్కారం సాధిస్తామని అన్నారు.కార్యక్రమంలో యునైటెడ్ టీమ్ నాయకులు మొహమ్మద్ ముస్తఫా (జిల్లా అధ్యక్షులు), ఎం.డి. అజీమ్ ఖాన్ (కోశాధికారి), సయ్యద్ లతీఫ్ అహ్మద్ (అధ్యక్షులు), అర్జున్ సింగ్ భట్టి (ఉపాధ్యక్షులు), ఎం.డి. సమీఉల్లా ఖాన్, ఎం.డి. వైజుద్దీన్, అబ్దుల్ రజాక్, ఫర్హా నాజ్, ఎం.డి. అయ్యూబ్ ఖాన్, ఫహీంఉద్దీన్, మొహమ్మద్ ఖదీర్, రజీ అహ్మద్, జహీర్ పాషా, సాదిక్ అలీ మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బొంకూరి శంకర్ మాట్లాడుతూ, యునైటెడ్ టీమ్ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని, మైనారిటీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తాను సంపూర్ణ మద్దతు అందిస్తానని హామీ ఇచ్చారు. ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# భాస్కర్ రెడ్డి పార్థివ దేహానికి నివాళులు అర్పించిన కే.వి.ఎన్. రెడ్డి



**తలకొండపల్లి, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, గోకార గ్రామ మాజీ సర్పంచ్ భాస్కర్ రెడ్డి పార్థివ దేహానికి వ్యవసాయ కమిషన్ సభ్యుడు కే.వి.ఎన్. రెడ్డి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని భగవంతుని ప్రార్థించారు. గ్రామ ప్రజలతో కలిసి ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు.

# జనగణన 2027పై ఎన్యుమరేటర్లకు శిక్షణ



**మర్రిగూడ, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జనగణన 2027 గృహ గణన ప్రక్రియపై ఎన్యుమరేటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గృహాల జాబితా తయారీ సమయంలో క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన నిబంధనలపై మాస్టర్ ట్రైనర్లు వివరణాత్మక శిక్షణ ఇచ్చారు.మండల తహసిల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎంపీడీవో మున్నయ్య మాట్లాడుతూ గణనలో ఎటువంటి తప్పులు దొర్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ శారద, ఇతర అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం



**మర్రిగూడ, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలోని కొండూరు గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'పోషణ పక్షం' కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే పౌష్టికాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ యశోద మాట్లాడుతూ, శిశువు ఎదుగుదలలో మొదటి వెయ్యి రోజులు అత్యంత కీలకమని వివరించారు. అంగన్‌వాడీ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో కొండూరు గ్రామ సర్పంచ్ ఆంబోతు సీతారాం నాయక్, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

# అక్రమంగా ఇసుక రవాణాపై కఠిన చర్యలు





**కరీంనగర్ ,ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ రూరల్ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా చేగుర్తి గ్రామానికి చెందిన చామనపల్లి సంపత్ కుమార్, చామనపల్లి విజయ్ తమ ట్రాక్టర్లలో మానేరు వాగు నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా దుర్షేడ్ గ్రామ ఫ్లైఓవర్ వద్ద పట్టుకున్నారు. అలాగే నగనూరు గ్రామానికి చెందిన అచ్చ కనకయ్య మూల వాగు నుండి ఇసుకను తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి, నిందితులపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపించారు. అనంతరం వారిని కరీంనగర్ రూరల్ తహసీల్దార్ ముందు హాజరుపరిచి లక్ష రూపాయల పూచీకత్తుపై బైండోవర్ చేశారు. అక్రమ ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరిస్తామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

## గౌడ జనాభా లెక్కలపై ప్రశ్నించాలి

**- మంద వేణుగోపాల్ గౌడ్**



**గంగాధర, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేలో గౌడ కులస్థుల జనాభాను తక్కువగా చూపించడంపై గౌడ ప్రభంజనం సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మంద వేణుగోపాల్ గౌడ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో పట్టణాలు, పల్లెలు అన్నింటిలో గౌడ కులస్థులు అధిక సంఖ్యలో ఉన్నారని, గౌడలు లేని గ్రామం దాదాపు లేదని పేర్కొన్నారు. రాజకీయంగా, సామాజికంగా గౌడ కులం అగ్రస్థానంలో నిలుస్తూ అన్ని రంగాల్లో ప్రత్యేక హోదాను పొందిందని అన్నారు. అయితే, సమగ్ర సర్వేలో గౌడ కులాన్ని కేవలం 16,30,187 జనాభా, 4.6% శాతంగా చూపించడం తప్పుడు లెక్కలని ఆయన విమర్శించారు. గౌడ కులం ఎదగకుండా చేయాలనే ఉద్దేశంతో ఈ లెక్కలు వక్రీకరించబడ్డాయని ఆరోపించారు. గౌడ నాయకులు, సంఘాలు, ఉద్యోగులు, విద్యార్థులు, కులస్థులు అందరూ ముక్తకంఠంతో ప్రశ్నించి, వ్యతిరేకించి, సరైన లెక్కలు చూపేలా సర్వేను సవరించాలని ఆయన డిమాండ్ చేశారు. గౌడ కులాన్ని తక్కువ చేసి చూపిస్తే, ఐక్యతతో పోరాడతామని హెచ్చరించారు.

## నీలగిరి ఎక్స్ప్రెస్ చొరవతో ట్రాన్స్ఫార్మర్ల మరమ్మతులు పూర్తి


నీలగిరి ఎక్స్‌ప్రెస్
www.neelagiriexpress.in
12 Apr 2026 - Page 5

చెట్లు, తీగలతో ప్రమాదంగా మారుతున్న ట్రాన్స్ఫార్మర్లు

కరీంనగర్, ఏప్రిల్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) కరీంనగర్ నగరంలోని పలు డివిజన్లలో ట్రాన్స్ఫార్మర్లు చెట్లు, ఎండిపోయిన తీగలతో కప్పబడి ప్రమాదకరంగా మారాయి. ఎండాకాలం కావడంతో వేడి పెరిగి మంటలు వ్యాపించే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు సంబంధిత అధికారులను వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ, ట్రాన్స్ఫార్మర్ల చుట్టూ రక్షణ కవచంలా కాంపౌండ్ వాల్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాదం జరగకముందే తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు ఉన్నతాధికారులను కోరుతున్నారు.


**కరీంనగర్, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ నగరంలోని పలు డివిజన్లలో ట్రాన్స్ఫార్మర్ల దగ్గర చెట్లు ఎండిపోయి తీగలతో కప్పబడి ప్రమాదకర పరిస్థితులు ఏర్పడినట్లు నీలగిరి ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 11న కథనం ద్వారా వెలుగులోకి వచ్చింది. ఈ సమస్యపై స్పందించిన అధికారులు కొన్ని డివిజన్లలో ట్రాన్స్ఫార్మర్ల వద్ద మరమ్మత్తు చర్యలు చేపట్టి ప్రమాదాన్ని నివారించారు. స్థానిక ప్రజలు సమస్యను వెంటనే పరిష్కరించిన అధికారుల చర్యలను అభినందించారు.

## కరీంనగర్--సిరిసిల్ల బైపాస్ రోడ్డులో వీధి దీపాల సమస్య



**కరీంనగర్, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ నగరంలోని కరీంనగర్--సిరిసిల్ల బైపాస్ రోడ్డులో ఉజ్వల పార్క్ నుండి పద్మనగర్ వరకు డివైడర్ మధ్యలో ఏర్పాటు చేసిన స్ట్రీట్ లైట్లు కొన్ని వెలగకపోవడంతో వాహనదారులు ప్రమాద భయంతో ప్రయాణిస్తున్నారు. ప్రజలు తెలిపిన వివరాల ప్రకారం, రాత్రి వేళల్లో లైట్లు వెలగకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, అధికారులు తక్షణ చర్యలు తీసుకొని అన్ని లైట్లు వెలిగేలా చూడాలని కోరుతున్నారు. అదేవిధంగా, రోడ్డుమధ్యలో గుంతలు ఏర్పడి వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని, రోడ్డుకి ఇరువైపులా భారీగా మట్టి కుప్పలు పేరుకుపోవడం వల్ల ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల భద్రత కోసం అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఫీల్డ్ అసిస్టెంట్లకు ఘన సన్మానం



**గన్నేరువరం, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గన్నేరువరం మండలంలోని గురుకుల కొండాపూర్ ఫీల్డ్ అసిస్టెంట్ యాదగిరి, హనుమాజిపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్‌లను జిల్లా కేంద్రంలో డిఆర్డిఓ శ్రీధర్ ఘనంగా సన్మానించారు. శనివారం జరిగిన కార్యక్రమంలో వారిని శాలువాతో సత్కరించి రూ.1000 బహుమతిగా అందజేశారు. కూలీలకు అధిక పని దినాలు కల్పించడం, నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టంలో హాజరును సమర్థంగా నమోదు చేయడం, ఉపాధి కల్పనలో ప్రతిభ కనబరిచినందుకు వారిని ప్రోత్సహిస్తూ అభినందించారు. ఈ సన్మానం ఫీల్డ్ అసిస్టెంట్ల కృషికి గుర్తింపుగా నిలిచింది.

## సాగునీరు అందక ఎండిపోతున్న వరి పంటలు

**-ఆదుకోవాలని డిండి ఆయకట్టు రైతుల ఆవేదన.**





**దేవరకొండ ఏప్రిల్ 18. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** ప్రస్తుత యాసంగి సీజన్‌లో నల్లగొండ జిల్లా,డిండి ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని రైతులు సాగు చేసిన వరి పంటలు సాగునీరు అందక గాలిలో దీపాల్లా మారాయి. ఎండల తీవ్రత పెరగడం, భూగర్భ జల మట్టాలు దారుణంగా పడిపోవడంతో బావులు, బోర్లు ఎండిపోయి పొలాలు బీడువారే పరిస్థితి నెలకొందని యువ రైతు టీ. గౌరారం మల్లేష్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా ఎండల తీవ్రత పెరగడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. నమ్ముకున్న బోర్లు, బావులు నీరు లేక వెక్కిరిస్తుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వరి పంట ప్రస్తుతం చివరి దశకు చేరుకుంది. మరో 15 నుండి 20 రోజులలో కోతలు ప్రారంభం కావాల్సి ఉండగా, ఈ కీలక సమయంలో నీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. ఆరుగాలం కష్టపడి, అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టిన పంట కళ్లముందే ఎండిపోతుంటే రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. “కోతకు సిద్ధంగా ఉన్న పంటను కాపాడుకోవడానికి ఈ ఆఖరి దశలో నీరు అందించడం చాలా ముఖ్యం. అధికారులు స్పందించి తక్షణమే సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలి.”డిండి ఆయకట్టు పరిధిలోని పంటలను కాపాడేందుకు ప్రభుత్వం మరియు నీటి పారుదల శాఖ అధికారులు తక్షణమే స్పందించాలని, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని అందించి రైతులకు భరోసా కల్పించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

## క్లిష్టమైన శస్త్రచికిత్సలకు నిలయంగా జిల్లా ఆసుపత్రి



**పెద్దపల్లి, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మరోసారి తన వైద్య నైపుణ్యాన్ని చాటుకుంది. కరీంనగర్‌లో రోడ్డు ప్రమాదంలో గాయపడిన 14 ఏళ్ల బాలుడికి అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ప్రైవేట్ ఆసుపత్రులు అధిక ఖర్చు అవసరమని చెప్పిన ఈ కేసులో, పెద్దపల్లి మాత శిశు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ వెంటనే స్పందించి ఆర్థో సర్జన్లకు చూపించారు. బాలుడి కుడి టిబియా ఎముక వెనుక-మధ్య భాగంలో అవల్షన్ ఫ్రాక్చర్, మోకాలి అంతర్గత గాయాలు ఉన్నట్లు గుర్తించారు. డాక్టర్ కుమార్ గౌడ్, డాక్టర్ వినయ్ కుమార్, అనస్తీషియా నిపుణుడు డాక్టర్ రామం కలిసి టైటానియం స్క్రూలతో ఓపెన్ రిడక్షన్ అండ్ ఇంటర్నల్ ఫిక్సేషన్ శస్త్రచికిత్స చేసి బాలుడి ప్రాణాన్ని రక్షించారు. ఈ విజయవంతమైన శస్త్రచికిత్సలో పాల్గొన్న వైద్య బృందాన్ని, ఓటీ సిబ్బందిని సూపరింటెండెంట్ ప్రత్యేకంగా అభినందించారు. ఆసుపత్రిలో నవజాత శిశు కేంద్రం, 2డి ఎకో, లాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలు, యూరాలజీ, రూట్ కెనాల్ వంటి ఆధునిక సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వీటిని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. అదేవిధంగా, ఆసుపత్రిలో సానిటేషన్, వాష్‌రూమ్ శుభ్రత వంటి అంశాలపై ఎవరైనా డబ్బులు అడిగినా లేదా సమస్యలు ఎదురైనా నర్సింగ్ సూపరింటెండెంట్, ఆర్ఎంఓ లేదా నేరుగా సూపరింటెండెంట్‌ను సంప్రదించాలని, లేకపోతే కంప్లైంట్ బాక్స్‌లో ఫిర్యాదులు ఇవ్వవచ్చని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సేవలు ఉచితమని, ఎవరికీ లంచం ఇవ్వవద్దని ఆయన స్పష్టం చేశారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ పార్టీ వైఖరిని వ్యతిరేకిస్తూ నిరసన



**మానకొండూర్ /హుస్నాబాద్, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు మరియు నియోజకవర్గాల పెంపు బిల్లుకు కాంగ్రెస్, ఇండియా కూటమి ఎంపీలు వ్యతిరేకంగా ఓటు వేసిన నేపథ్యంలో కరీంనగర్ జిల్లా మానకొండూర్, సిరిసిల్ల నియోజకవర్గంలో బీజేపీ నేతలు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. మానకొండూర్ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు కంది రాజిరెడ్డి ఆధ్వర్యంలో పల్లె మీద చౌరస్తాలో ధర్నా నిర్వహించి రాహుల్ గాంధీ చిత్రపటాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీపూర్ ఉప సర్పంచ్ రాపాక ప్రవీణ్, మహిళా మోర్చా మండలాధ్యక్షురాలు ఆవుధరి విజయ మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చారిత్రాత్మకంగా తీసుకున్న మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లును కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించడం హేయమైన చర్య అని విమర్శించారు. రాహుల్ గాంధీ, ఇండియా కూటమి ఎంపీల సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదే రోజు హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. శంకర్ బాబు మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా ఎన్డీయే కూటమి మహిళా సాధికారత కోసం పాటుపడుతుంటే, కాంగ్రెస్ పార్టీ నిరంతరం వ్యతిరేకిస్తూ మహిళలను కించపరుస్తోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వక్రబుద్ధిని మహిళలు అర్థం చేసుకుని తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ నేతలు, మహిళా మోర్చా నాయకులు, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శులు, మండల కార్యవర్గ సభ్యులు, యువజన మోర్చా నాయకులు, సీనియర్ నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

## తేజస్వి సూర్య వ్యాఖ్యలు అమరవీరులకు అవమానం

**-మాజీ డైరెక్టర్ సురమల్ల సుభాష్**



**ఆమనగల్లు, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య పార్లమెంటులో చేసిన వ్యాఖ్యలు అత్యంత ద్వేషపూరితంగా ఉన్నాయని ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సురమల్ల సుభాష్ ధ్వజమెత్తారు. ఇది అమరుల త్యాగాలను అవమానించడమేనని ఆక్షేపించారు. శనివారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. 60 ఏళ్ల పోరాటం, తెలంగాణ బిడ్డల బలిదానాలు, ఉద్యమాన్ని తెలంగాణ ఏర్పాటుపై బీజేపీ విషం చిమ్మడం మానలేదని, అందుకు నిదర్శనమే కర్ణాటక బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య అనుచిత వ్యాఖ్యలని విమర్శించారు. త్యాగాలు, సుదీర్ఘ పోరాటంతో సిద్ధించిన తెలంగాణను తక్కువ చేసి మాట్లాడటం తగదని, ఈ వ్యాఖ్యలపై బీజేపీ, కాంగ్రెస్ ఎంపీ లు మౌనం వహించడం విచారకరమన్నారు. తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, వెంటనే రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి పర్యటన విజయవంతం చేయాలని పిలుపు



**పెద్దపల్లి, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఈనెల 20న మంథని నియోజకవర్గంలోని కాటారం మండల కేంద్రంలో జరగబోయే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పిలుపునిచ్చారు. శనివారం సుల్తానాబాద్ పట్టణంలోని యశోద నరహరి ఫంక్షన్ హాల్, కాల్వశ్రీరాంపూర్ వ్యవసాయ మార్కెట్, ఓదెల మండలం పోత్కపల్లి గ్రామంలో మండల, పట్టణ కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహించారు. సభకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరై సీఎం పర్యటనను సఫలీకృతం చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మున్సిపల్ చైర్మన్, పలు మండల పార్టీ అధ్యక్షులు, వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్లు, గ్రామ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణపై అవగాహన

**- రాయికల్‌లో ఫైర్ సేఫ్టీ సదస్సు**



**ఫరూక్‌నగర్, ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిత్యజీవితంలో సంభవించే అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సిఐఎస్ఎఫ్ ఇన్స్పెక్టర్ దిలీప్ సోనవానే, ఫైర్ సేఫ్టీ ఇన్స్పెక్టర్ వై.వి.బి. రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రాయికల్ ప్రాథమిక పాఠశాలలో హెడ్‌మాస్టర్ కె. శారద అధ్యక్షతన విద్యార్థులకు ఫైర్ సేఫ్టీ పరికరాల వినియోగంపై ప్రత్యేక అవగాహన సదస్సు జరిగింది. సుమారు 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అధికారులు ప్రత్యక్ష ప్రయోగాలతో గ్యాస్ సిలిండర్ ద్వారా మంటలు చెలరేగినప్పుడు అనుసరించాల్సిన మెళకువలను చూపించారు. ప్రమాదం సంభవించినప్పుడు భయపడకుండా ధైర్యంగా వ్యవహరించాలని, వెంటనే పోలీసులకు, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలని సూచించారు. మనల్ని మనం రక్షించుకుంటూనే చుట్టుపక్కల వారిని కాపాడే సామాజిక బాధ్యత ప్రతి ఒక్కరిలో ఉండాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వప్న, అరుణ, వరలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు వెల్దండలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**వెల్దండ, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. లైన్ ఎరెక్షన్ పనుల కారణంగా ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ నిలిపివేయబడుతుందని ఏఈ వివరించారు. ఈ సమయంలో మొల్లోని చెలుక, జూనియర్ కాలేజీ వైపు, వీర నాగమ్మ దేవాలయం, ఎస్సీ వాడ నుండి మెడికల్ షాప్ లైన్ వరకు, గ్రామపంచాయతి వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. ఈ అసౌకర్యానికి గ్రామ ప్రజలు సహకరించాలని విద్యుత్ అధికారులు కోరారు.

# రైతుల కోసమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు

**- చర్ల వెంకట్ రెడ్డి**



**తలకొండపల్లి, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్జాల్ గ్రామంలో మక్కలు, వరి కొనుగోలు కోసం పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి ప్రారంభించారు. రైతులు పండించిన పంటను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని, దళారుల మాటలు నమ్మి మోసపోకూడదని ఆయన సూచించారు. సన్‌ఫ్లవర్ పండించిన వారు పడకల్ కేంద్రానికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మాజీ సింగిల్ విండో చైర్మన్ అంజయ్య గౌడ్, వైస్ చైర్మన్ రవికుమార్, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# శరీరానికి 'నిశ్శబ్ద ఇంజన్' కాలేయం

**- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కే. లలితాదేవి**



**బూర్గుల, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** "శరీరంలో జరిగే 500కు పైగా జీవక్రియలకు కాలేయమే కేంద్ర బిందువు. దీనిని రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత" అని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కే. లలితాదేవి పేర్కొన్నారు. ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా శనివారం ఫరూక్‌నగర్ మండలం బూర్గుల ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ లలితాదేవి మాట్లాడుతూ కాలేయం దెబ్బతిన్న ప్రారంభ దశలో లక్షణాలు బయటపడవని, అందుకే దీనిని 'సైలెంట్ కిల్లర్' అంటారని వివరించారు. కేవలం మద్యపానం వల్లే కాకుండా, జంక్ ఫుడ్, అధిక కొవ్వు, వ్యాయామం లేకపోవడం వల్ల 'నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్' కేసులు పెరుగుతున్నాయని తెలిపారు. ప్రతిరోజూ 30--45 నిమిషాల వ్యాయామం, సమతుల్య ఆహారం, తగినంత నీరు తీసుకోవడం, మద్యపానానికి దూరంగా ఉండడం ద్వారా కాలేయాన్ని పటిష్ఠంగా ఉంచుకోవచ్చని సూచించారు. "మంచి అలవాట్లు -- పటిష్టమైన కాలేయం" అనే నినాదంతో ప్రజలందరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఏడాదికి ఒకసారి కాలేయ పనితీరు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా ఆఫీసర్ కె. శ్రీనివాసులు, వైద్యాధికారులు డాక్టర్ రఘురాం, డాక్టర్ జయప్రకాష్, ల్యాబ్ టెక్నీషియన్ వెంకటరమణి, స్టాఫ్ నర్స్ సునీత, ఫార్మసిస్ట్ రాజశ్రీ, హెల్త్ అసిస్టెంట్ రెడ్డి నాయక్ మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ ఏర్పాటును విరమించుకోవాలి

**ఆమనగల్లు, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ 2వ వార్డు మూర్తుజపల్లి శివారులో డంపింగ్ యార్డ్ ఏర్పాటును తక్షణమే విరమించుకోవాలని పార్టీలకు అతీతంగా ఆయా పార్టీల నాయకులు, గ్రామస్తులు కలిసి శనివారం తహసిల్దార్ ఫహీం ఖాద్రి, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, ఛైర్మెన్ పత్యనాయక్ లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు వల్ల మూర్తుజపల్లి గ్రామా ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో పాటు అనేక రకాల అనారోగ్య సమస్యలకు లోనయ్యే ప్రమాదం ఉందని అక్కడే



మంచినీటి ట్యాంకు, దేవాలయాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, ఈ ప్రాంత రైతులు వ్యవసాయ భూములు నష్టపోయే అవకాశం ఉందని, భూసారం తగ్గి పంటల దిగుబడి తగ్గిపోతుందని తెలిపారు. ప్రాజెక్టును తక్షణమే ఆపివేయాలని డిమాండ్ చేశారు. తహసిల్దార్, కమిషనర్, ఛైర్మెన్ లు ఈ అంశంపై సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో కర్నాటి కొండల్ రెడ్డి, కర్నాటి సాయి రెడ్డి, కర్నాటి శ్రీధర్ రెడ్డి, మెండే చంద్రశేఖర్, కాలే మహేష్, బోదాస్ చంద్రశేఖర్, కర్నాటి రత్న కుమార్, బైకని శ్రీను, బైకని సత్యం, బైకని బాలయ్య, గోగుల శ్రీను, గోగుల కృష్ణ కుమార్, గండికోట శ్రీను, దేరంగుల శ్రీకాంత్, దూసకంటి ప్రమోద్ గౌడ్, కాలే ప్రదీప్, కాలే సాయి కుమార్, చాట్ల శ్రీను తదితరులు ఉన్నారు.

# పకృతి పరిరక్షణ అందరి బాధ్యత

**- జిల్లా గవర్నర్ డాక్టర్ జి మహేంద్ర కుమార్ రెడ్డి**



**ఆమనగల్లు, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ సేవా వారోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 18 నుండి 26 వరకు పర్యావరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఇందులో మొదటి రోజైన శనివారం నాడు గ్రీన్ ప్లేడ్జ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా గవర్నర్ డాక్టర్ మహేంద్ర కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, పర్యావరణం అంటే కేవలం చెట్లు పెంచడం మాత్రమే కాదని వ్యర్థాల నిర్వహణ ప్లాస్టిక్ వాడకం ఈ వేస్ట్ కలెక్షన్ వన్యప్రాణి సంరక్షణ రైతులకు పర్యావరణంపై అవగాహన కల్పించడం పాఠశాలల్లో విద్యాలయాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించడం లాంటి కార్యక్రమాలన్నీ ఈ వారోత్సవాల్లో నిర్వహిస్తామని, ప్రతి ఒక్క పౌరుడు పర్యావరణాన్ని పరిరక్షించేలా తగు చర్యలు తీసుకుంటూ, తన పరిసరాల్లో వేస్ట్ మేనేజ్మెంట్ మరియు నీటి సంరక్షణ పద్ధతులు తప్పకుండా నిర్వహించాలని చెప్పారు. ఇంకా వారు మాట్లాడుతూ ఆర్.ఆర్.ఆర్ అనే సూత్రాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని అంటే రెడ్యూస్, రీయూస్, రీసైకిల్ అనే మంత్రాన్ని సర్వదా దృష్టిలో ఉంచుకుంటే పర్యావరణాన్ని చాలావరకు సంరక్షించినట్లేనని చెప్పారు. ఈ వారోత్సవాల్లో ప్రతి క్లబ్ ప్రతిరోజు ఇంటర్నేషనల్ నుండి సూచించినట్లుగా ఆయా కార్యక్రమాలను తప్పకుండా చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా మాజీ గవర్నర్ జి చెన్నై కిషన్ రెడ్డి, ఆమనగల్ క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, కార్యదర్శి గంప శ్రీను కోశాధికారి జి శ్రీనివాస్ రెడ్డి, కడ్తాల్ క్లబ్ సభ్యులతో పాటు క్లబ్ పిఆర్ఓ పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఎండల్లో బయటకు రావొద్దు.. ప్రజలకు ఎమ్మెల్యే నారాయణరెడ్డి సూచనలు




**అమనగల్లు, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఎండల్లో బయటకు రావొద్దని ప్రజలకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సూచించారు. శనివారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మార్గనిర్దేశం చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బయటకు రావొద్దని పేర్కొన్నారు. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల మధ్య పనులు పూర్తి చేసుకోవాలని తెలిపారు. బయటకు వస్తే టోపీ, తలపాగా వంటివి తప్పనిసరిగా ధరించాలని దిశానిర్దేశం చేశారు. ఎండదెబ్బ ప్రమాదమని.. ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని ఎమ్మెల్యే నారాయణరెడ్డి తెలిపారు. అధికారులు గ్రామాలు, మున్సిపాలిటీలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీ స్థాయిలో తాగునీటి సౌకర్యాలను కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే, ఉపాధి హామీ కార్మికులకు ప్రత్యేక సూచనలు చేశారు. పని స్థలాల్లో తాగునీటి వసతి ఏర్పాటు తప్పనిసరని తెలిపారు. ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో పని చేసే ప్రాంతాల్లో ఆయా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కార్మికుల ఆరోగ్యం అత్యంత ముఖ్యమని ఎమ్మెల్యే కసిరెడ్డి పేర్కొన్నారు.

# సురక్షిత ప్రయాణమే 'అరైవ్-అలైవ్' లక్ష్యం

**- ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు**




**ఆమనగల్లు, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రమాదాల బారిన పడకుండా వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు కచ్చితంగా పాటించేలా అవగాహన కల్పించడమే 'అరైవ్ అలైవ్' కార్యక్రమ లక్ష్యమని ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల్లో భాగంగా రోడ్డు భద్రతపై 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని శనివారం పట్టణ కేంద్రంలోని పోలీస్ స్టేషన్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ప్రమాదాల నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వాహనదారులు విధిగా, ట్రాఫిక్, రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని సూచించారు. హెల్మెట్ ధరించకుండా నిర్లక్ష్యంగా బైక్ నడపడం వల్ల 90శాతం మంది మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఐ సీతారాం రెడ్డి, పోలీస్ సిబ్బంది, వాహనాదారులు తదితరులు ఉన్నారు.

# కరెంట్ షాక్ కు గురైన బాలుడికి ఆర్థిక సహాయం



**ఆమనగల్లు, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు జంగారెడ్డిపల్లికి చెందిన మొహమ్మద్ హుస్సేన్ కు ఇటీవలే విద్యుత్ షాక్ గురై తీవ్రంగా గాయాలై హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మహమ్మదీయ మస్జిద్ అధ్యక్షుడు ఖాదర్ ఖాద్రి శనివారం ఆసుపత్రికి చేరుకుని బాలుడు హుస్సేన్ ను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అతని కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. బాధితుడికి మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లకు సూచించారు. అనంతరం వైద్య ఖర్చులు నిమిత్తం 15 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు.

# ఎఫ్.ఎల్.ఎన్ ఛాంపియన్లు -- సుల్తాన్‌పూర్, రాములపల్లి



ప్రశంస పత్రాలు అందుకుంటున్న ఉపాధ్యాయులు

**ఎలిగేడు, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని సుల్తాన్‌పూర్, రాములపల్లి ప్రాథమిక పాఠశాలలు జిల్లా స్థాయి ఎఫ్.ఎల్.ఎన్ ఛాంపియన్లుగా నిలిచాయి. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశాల మేరకు ఈ విద్యాసంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకున్నందుకు ప్రశంసా పత్రాలను ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచులు కవ్వంపల్లి బాపయ్య, సిద్ది తిరుపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

# ఫార్మా భూముల్లో రైతులు పంటలు సాగు చేయొద్దు..



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** యాచారం మండల పరిధిలోని కుర్మిద్ద, తాటిపర్తి, నానక్ నగర్, మేడిపల్లి గ్రామాల్లో ఫార్మా సిటీ సేకరించిన భూముల్లో రైతులు పంటలు సాగు చేయవద్దని కలెక్టర్ ఆదేశించినట్లు ఇబ్రహింపట్నం =ఖూ అనంతరెడ్డి తెలిపారు. ఫార్మా భూములను శనివారం కుర్మిద్ద, తాటిపర్తి, నానక్ నగర్, మేడిపల్లి భూములను పరిశీలించారు. శనివారం మండల పరిధిలోని నానక్ నగర్, మేడిపల్లి, కుర్మిద్ద, తాటిపర్తి, గ్రామాలలోని ఫార్మాసిటీ కోసం సేకరించిన అసైన్డ్ భూములను ఇబ్రహీంపట్నం ఆర్డిఓ అనంతరెడ్డి, పరిశీలించారు. ఈ సందర్భంగా =ఖూ మాట్లాడుతూ.. గతంలో నష్టపరిహారం పొందిన చెల్లించిన ఫార్మాసిటీ కోసం భూములను సేకరించడం జరిగిందని వివరించారు. ఆ భూములలో రాబోవు వాన కాలంలో నాలుగు గ్రామాలలోని నష్టపరిహారం పొందిన రైతులు ఎలాంటి పంటలు సాగు చేయొద్దన్నారు. కలెక్టర్ ఆదేశించారని తెలిపారు రైతులంతా విషయాన్ని గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో అయ్యప్ప ఉన్నారు.

# రద్దయిన నోట్లపై గైడ్‌లైన్స్ అవాస్తవం..

## కేంద్రం ప్రకటన




**న్యూఢిల్లీ ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** కేంద్ర ప్రభుత్వం గతంలో రద్దు చేసిన కరెన్సీ నోట్లను మార్చుకోవడానికి రిజర్వ్ బ్యాంకు కొత్త మార్గదర్శకాలను జారీ చేసిందని వచ్చిన వార్తా కథనాన్ని కేంద్ర ప్రభుత్వం శనివారం ఖండించింది. ఆ వార్తలో నిజం లేదని, ఆర్‌బీఐ అలాంటి ప్రకటన ఏదీ చేయలేదని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోకి చెందిన ఫ్యాక్ట్ చెక్ యూనిట్ తెలిపింది. అటువంటి సమాచారాన్ని పంచుకునే ముందు విశ్వసనీయ వర్గాల నుండి ధ్రువీకరించుకోవాలని పీఐబీ పౌరులకు సూచించింది. తప్పు దారి పట్టించే లేదా వక్రీకరించిన కంటెంట్‌ను తమకు నివేదించాలని కూడా ప్రజలను కోరింది. రద్దు చేసిన రూ.500, 1000 నోట్లను మార్చుకునేందుకు ఆర్‌బీఐ కొత్త మార్గదర్శకాలను జారీ చేసినట్లు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది.

# ఎలిగేడులో సెన్సెస్ 2027 శిక్షణ



**ఎలిగేడు, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండలంలో సెన్సెస్--2027 కార్యక్రమంలో పాల్గొనే ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు మూడు రోజుల శిక్షణను రైతు వేదికలో ప్రారంభించారు. తహసిల్దార్ యాకన్న శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించి, హౌస్ లిస్టింగ్ అండ్ హౌసింగ్ సెన్సెస్‌ను తప్పులు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అనుమానాలు ఉంటే శిక్షణలోనే నివృత్తి చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఎస్ఓ స్వప్న, ఎంపీడీవో భాస్కర్ రావు, మాస్టర్ ట్రైనర్లు, ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# దూలికట్టలో పోషణ అభియాన్



దూళికట్టలో పోషన్ అభియాన్ ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడి సూపర్వైజర్ సూర్య కళ అంగన్వాడి టీచర్లు



పౌష్టిక ఆహారం అందజేస్తున్న సర్పంచ్ మారం కొమురయ్య

**ఎలిగేడు, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దూలికట్ట గ్రామం 3వ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ అభియాన్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పోషణ పక్షం, ఈసీసీఈ డే, ఏఎల్ఎంఎస్సీ సమావేశాలు నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ సూర్యకళ పోషణపై ప్రతిజ్ఞ చేయించి, చిన్నారులకు అన్నప్రాశన కార్యక్రమం నిర్వహించారు. తల్లులకు శిశువుల తొలి 1000 రోజుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మారం కొమురయ్య, అంగన్‌వాడీ టీచర్లు ప్రభావతి, భారతి, వెంకటమ్మ, రజిత, వార్డు సభ్యులు, తల్లులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్ఎస్ఎస్ ఉత్సవాలకు కేంద్రం నిధులు

## మీడియా ప్రకటనలకు రూ76 లక్షలు



**న్యూఢిల్లీ: ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలకు కేంద్ర సాంస్కృతిక శాఖ 76 లక్షల రూపాయల నిధులు వెచ్చించింది. సహ చట్టం ద్వారా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా వివిధ ప్రింట్ మీడియా సంస్థలకు ప్రకటనలు ఇచ్చేందుకు ఆ శాఖ ఈ మొత్తాన్ని ఖర్చు చేసింది. సామాజిక కార్యకర్త అజయ్ బాసుదేవ్ సమాచార హక్కు చట్టం కింద ఈ వివరాలను ఈ నెల 13న పొందారు. దీనిపై సాంస్కృతిక శాఖ కార్యదర్శి వివేక్ అగర్వాల్ వివరణ ఇచ్చారు. నేషనల్ ఇంప్లిమెంటేషన్ కమిటీ గుర్తించిన సంస్థల వార్షికోత్సవాలు, శతాబ్ది ఉత్సవాలను కేంద్ర సాంస్కృతిక శాఖ నిర్వహించడం మామూలేనని చెప్పారు.

# సీఈసీ తొలగింపునకు మళ్లీ విపక్షాల నోటీస్!



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** తమ మునుపటి నోటీసులు తిరస్కరణకు గురైనప్పటికీ వెరవకుండా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ తాజా ప్రయత్నానికి విపక్షాలు సిద్ధమవుతున్నాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇందుకోసం పలు విపక్ష పార్టీల నాయకులు చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. అలాగే కాంగ్రెస్, టీఎంసీ, సమాజ్‌వాది పార్టీ, డీఎంకే సహా వివిధ పార్టీలకు చెందిన కనీసం ఐదుగురు సీనియర్ ఎంపీలు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తొలగింపు ప్రక్రియను ప్రారంభించేందుకు కొత్త నోటీస్ ముసాయిదాను రూపొందించే పనిలో ఉన్నారు.

# అధైర్య పడకండి.. అండగా ఉంటా

- కౌన్సిలర్ పాపిశెట్టి రాము



**ఆమనగల్లు, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాకు చెందిన మూడావత్ శ్రీను నాయక్, మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు సంకటోనిపల్లికి చెందిన గద్ద సాయిలు అనారోగ్యా కారణాలతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము శనివారం మృతుల కుటుంబాల ఇంటికి వెళ్లి వారి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. అధైర్య పడకండి అండగా ఉంటానని భరోసా కల్పించారు. తన వంతు సహాయంగా ఆయా కుటుంబ సభ్యులకు విడివిడిగా 4000 రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట 8వ వార్డు కౌన్సిలర్ ఎనుమల్ల రమేష్, మాజీ కౌన్సిలర్ కమటం రాధమ్మ వెంకటయ్య, శ్రీను నాయక్, అనంత రాములు, లక్ష్మణ్, రవీందర్, పాండు, లక్ష్మణ్, మణిపాల్, రమేష్, శంకర్, జగన్, శివ తదితరులు ఉన్నారు.

# 21న మెగా రక్తదాన శిబిరం

**ఆమనగల్లు, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఈ నెల 21న రక్తదానం శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షులు కే. గోవర్ధన్ రెడ్డి, క్లబ్ పిఆర్ఓ ఎంఏ పాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లయన్స్ క్లబ్ సభ్యులు లయన్ బి. అంజిరెడ్డి 15వ సారి రక్తదానం చేస్తున్న సందర్భంగా పెద్దూరు దేవుని పడకలలో ఎస్ఎల్ఎన్ స్వామి ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా యువతీ యువకులు ముందుకు వచ్చి రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ఆర్థిక సహాయం




**ఆమనగల్లు, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** అమనగల్లు మండల పరిధిలోని మేడిగడ్డ తాండకి చెందిన మూడావత్ శ్రీను నాయక్ గురువారం మృతి చెందాడు. తాండ యువనాయకుడు సుమన్ నాయక్ శనివారం మృతుడు శ్రీను నాయక్ ఇంటికి వెళ్లి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. తనవంతు సహాయంగా కుటుంబ సభ్యులకు 25 కిలోల బియ్యాన్ని అందజేశారు. అయన వెంట మల్లేష్ నాయక్ తదితరులు ఉన్నారు.

# యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిని కలిసిన శ్రీకాంత్



**ఆమనగల్లు, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ్ భాను చీబ్ ను ఆమనగల్లు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్ శనివారం హైదరాబాద్ ధర్నా చౌక్ వద్ద కిసాన్ న్యాయ్ మహాధర్నా అనంతరం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించినట్లు తెలిపారు. నేటి యూత్ నాయకులే రేపటి ప్రజా ప్రతినిధులని, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లి, కాంగ్రెస్ పార్టీ లక్ష్యాలను, ఘనతను ప్రజలకు వివరించాలని, దేశం కోసం త్యాగం ఎవరు చేసినారో ప్రజలకు వివరించాలని ఉదయ్ భాను చీబ్ సూచించినట్లు శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి వంగ లక్ష్మీకాంత్ రెడ్డి ఉన్నారు.

# నీలగిరి- సాహితీ సంగమం

## శీర్షిక:- గణేష చరిత
### ప్రక్రియ :- పద్యం(ఆటవెలదులు)

1
పిండితోన చేసె పిల్లాడి బొమ్మను
పార్వతమ్మ యెంతొ పావురమున
బ్రహ్మదేవు కోర ప్రాణమ్ము పోయగా
అమ్మ రక్ష చేయ యనుమతించె
2
తపముతీరి తండ్రి తరలిరాగను జూసి
యడ్డగించె నంట యాత్మజుండు
దారి యివ్వకున్న త్ర్యక్షుడావేశాన
తనయు తలను త్రుంచె తాపమొచ్చి
3
తల్లడిల్లెనంట తల్లితనయు గాంచి
ప్రాణసఖుడి పైన కోపగించ
కరివదనము ద్రెంచి గజముఖమును గూర్చి
సఖియ నలక దీర్చె సత్వరమ్మె
4
విఘ్నములను బాపు వినాయకుండని
విశ్వమంత నేడు వేడుకొనగ
తరలి వచ్చె తాను ధరణికి దడయక
భక్తులకును తాను ముక్తినొసగ

**విజయప్రసాద్ నలుమాసు**
**కరీంనగర్**

## ఆ!!వె!! ప్రహేళికలు

1
చెఱకు రసము తీపి చేదుగా తలపించు
వేపచిగురు యెండు చేప కూర
వండువనిత చింతమండ దెబ్బచురుకు
తగులు తాటిచెట్టు తల్లికాదు!!
2
అరటిపండు మేలు ఆయాసము గలుగ
జేయు పరుగు జావ జుర్రుచుంద్రు
వృద్ధు లెల్ల నేటి విద్యార్థిలోకమ్ము
నికషలందు నిక్క నీల్గు చుంద్రు!!
3
ఉట్టిమీద కుండ పట్టుకుంటే కుట్టు
తేలు నూనెలోన తేలుచుండు
గారె మంచుకొండ గంగ సింధు నదికి
పుట్టినిల్లు చీమ కుట్టుచుండు!!
4
నేలపైన పుట్ట నిమ్మ కాయరసము
వేసవినను చలువ విషము జిమ్ము
పాము కోతి చెట్ల పైన నెగురు కోడి
కూతబెట్టు నల్లి కుట్టు చుండు!!

**గడ్డం కృష్ణారెడ్డి.**
**రేపాల సూర్యాపేట!!**

## శీర్షిక :
### మాయమౌతున్న మానవత్వం

అహంకారం నీడలో, అంతరించింది మానవత్వము
అంతులేని అసూయతో, అవతరించింది మూర్ఖత్వము

స్వార్థపు వలలో, సన్నగిల్లింది మమకారము
సాటిలేని కక్షతో, సంతరించింది మధుర్యము

క్రోధపు కోరల్లో చిక్కి చిన్నబోయింది ఆత్మీయత
ఆవేశం అంచున చేరి అంతరించింది ఆప్యాయత

పంథాల మాటునజేరి పలకరింపు కరువైనది
పఠింపులు చెంతజేరి మాట తీరు బరువైనది

విరామం లేకుండ సంపద పెరిగింది
విషపూరిత జీవనం ఆరంభమైంది

భాదను పంచుకునే బంధాలు లేవు
భరోసాగా నిలబడే బంధువులు లేరు

మానవత్వమే మనిషిని మహోన్నతుని చేస్తోంది
మంచి తనమే మానవుని మహనీయుని చేస్తోంది

**పేరు : వి.అశోక్**
**మంథన్ గోడ్, నారాయణ పేట**

## శీర్షిక:- దేవి స్థుతి
### పద్యం :- పంచచామరం

1
వివేకవర్ధినీ ప్రశాంత విశ్వమోహినీ నమో
సువాసినీ విశాలనేత్ర సుందరీ మహేశ్వరీ
జవంబునీయవమ్మ మాకు శక్తిరూపధారిణీ
సువర్ణ,ధాత్రి, శైలపుత్రి చూడవే సుహాసినీ!!
2
భవాని దేవి పార్వతీ ప్రభాకరీ పరాత్పరీ
నవీనకాంతివీవె శోభనా ప్రమోదవర్షిణీ
శివాని శాంకరీ పవిత్రచిత్తమానసా నమో
నివేదయామి ధూప, దీప నిత్య పాయసాన్నముల్!!

రచన.
**తిప్పారపు లక్ష్మీ నర్సయాచార్యులు, వెదిర.**

## ప్రక్రియ: పద్యం(ఆటవెలదులు)

1
బతుకు దారినందు భవితను జూపగ
నవ చరితను రాయ నాంది పలుకు
విద్య జెప్పు నిన్ను విశ్వముకు దెలుప
అక్షరాల తరవు అయ్యె గురువు
2
సుద్ది రీతె నీదు సుగుణంబు దెల్పగన్
బుద్ధి తీరె బత్కు బువ్వ దొర్కు
నడత రోకు దెచ్చు నలుగుర్ల విలువనే
నిజమెరుకపడు హరి యిజము వలన
3
సంపదెంతయున్న సంతృప్తి కరువయ్యె
దరముకయ్యె బ్రతుకు దాసి వోలె
హర్షమునే మించు ఐశ్వర్యములేదు
నిజమెరుక పడు హరి యిజము వలన

**హరీష్ తాటి**
**పరకాల**

## శీర్షిక..విశ్వ విఖ్యాతుడు
### ప్రక్రియ కవిత

దళిత కుటుంబంలో పద్నాలుగవ
సంతానంగా జననం
కష్టాలెన్నోఅనుభవించి,
స్వయంగా పెంచుకున్న వ్యక్తిత్వం
కుల మత రహిత
సమాజనిర్మా ణం అతని ధ్యేయం
అందుకు అతని కృషి అజరామరం.

దళితజనోద్ధరణకై కృషిచేసిన వాడు
వారి సమస్యల పరిష్కారానికై శ్రమించాడు
ధనిక బీద తేడాలు తెలియనివాడు
అంటరానితనం నిర్మూలించి
నాడు
బడుగు వర్గాల ఆశాజ్యోతి అయినాడు.

గణతంత్రరాజ్యం కావాలని భావించే
చట్టం దృష్టిలో అందరు సమానమనిబోధించే
అంబేద్కర్ డ్రాఫ్టింగ్ కమిటీ అధ్యక్షునిగా
రాజేంద్ర ప్రసాద్ కమిటీ అధ్యక్షునిగా
రూపకల్పన జరిగిన రాజ్యాంగం
అతిపెద్ద రాజ్యాంగం మనది
అవతారిక అధికరణలతో కూడినది.

ప్రాథమిక హక్కులు విధులు
ఇందున్నవి
ఆదేశ సూత్రములు
లౌకిక సర్వసత్తాక సూచికలు

అధ్యాపకునిగా పత్రికా సంపాదకునిగా
న్యాయ సామాజిక ఆర్థికశాస్త్రాలలో పరిశోధకునిగా అతిపెద్దరాజ్యాంగ
రూపశిల్పిగా
మహామేధావిగా సంఘసంస్కర్తగా
ఆర్థిక వేత్త గా, రాజకీయ నేతగా
న్యాయ శాస్త్రవేత్తగా భారత రాజ్యాంగశిల్పిగా
ప్రజాస్వామ్య పరిరక్షకుడిగా విశ్వ విఖ్యాతుడు అంబేద్కర్.

**డా. జి భవానీ కృష్ణమూర్తి**
**హైదరాబాదు**

## శీర్షిక...రాజ్యాంగ దీప్తి.
### ప్రక్రియ.. పద్యము.

**సీసపద్యము.**

విరచించె రాజ్యాంగ విజ్ఞానదీప్తినీ
సమసమాజమునందు సమత నింప
కోటి యాశల తోడ కొత్త కాంతులు చిందె
రాజ్యాంగ గ్రంథమే రాజసముగ
వెనుకబడిన వార్కి వేల్పుయై వెలుగొందె
చదువుబాటను వేసి సకల జగతి
యంబేదుకరుడను నద్భుత నామంబు
వసుధనంతయు గూడ వాసికెక్కె.

**ఆటవెలది..**

సకల జగతి జూడ సహనశీలియె వారు
త్యాగగుణమునందు తరువు రూపు
చట్టమంత రాసి సవరించె న్యాయమున్
నాడు నేడు రేపు నవ్యుడతడు!

**కొంటికర్ల లలిత**
**ధర్మపురి**

## గణపతి ప్రార్థన
### ప్రక్రియ :- పాట

అందమైన నీ పాదములకు నే వందనములు చేసెదనయ్యా ...
**పల్లవి:-** అందమైన నీ పాదములకు నే వందనములు చేసెదనయ్యా
తల్లి పార్వతి తనయా గణపతి
స్మరియింతును నిను సరిగమల!
అందమైన

చ:- అక్షర పదములు అల్లిక జేసి
మాలగయల్లీ గజవదనా//2//
పల్లవి చరణము పొందుగచేసి
పాటగమలచితి నీ కొరకే!
అందమైన

చ:- వ్రాసిన పదముకు మధురపు స్వరములు
తోచిన విధముగ నే కూర్చి //2//
రాగము తాళము భావము తోడను
రమ్యముగను నిను భజియింతు
అందమైన

చ:- ప్రథమ పూజిత పరమ దయామయ
ప్రమధగణదిపా పరమేశ//2//

నీదయ కోరుతు నిరతము వెడుతూ
స్వరార్చన జేయుదు సర్వేశా!
అందమైన

**పుల్లూరి నాగేశ్వర్ పుల్లూరి**
**కాటారం**